మాయమ్మా నేనూ సాయం పట్టుకుంటే.. ఆ మామ బర్రె కాలుకు కట్టు కడ్తా..

''ఎట్లా జరిగిందిమ్మా!?'' అనె.

''ఏమోనన్నా! ఇది సుట్టుపక్కల దూడలను పెద్దదిక్కు మాదిరి ఎంటేసుకొని వంకలోకి మేతకు బోతది. వంకవతలి చేల మనుషులు ఎవ్వరో కొట్టె ట్టుండారన్నా!'' అని అమ్మ బదులు సెప్పింది దిగులుగా.

''సూచ్చా ఉంటే..



ఇది రాయితో కొట్టిన దెబ్బ మాదిరి ఉండా దమ్మా. అదిలిచ్చే అవతలికి బొయ్యే గొడ్డును కొట్టడానికి ముండనా కొడకలకు ఎట్ల సేతులొచ్చయో ఏందో!'' అంటా కట్టుగట్టి లేసి నిలబడిండు మామ.

''అన్నా! ఇంతకూ దీని కాలు కట్టుకుంటాదా''.. మాయమ్మ గొంతులో ఆదుర్దా కనపడతానే ఉంది.

''కట్టుకుంటాది లేమ్మా!'' అని ఇంటిదావ బట్టిండు మామ.

ఆయన ఆ మాట మాయమ్మ సంతోషంకోసం అన్నెట్టుం డాడు.. ఆయన గొంతును బట్టిసూచ్చే. ఇదేమో ముసిలి పాయపు గొడ్డయిపాయ. మనము ఎంతమంది మను షుల గురించి వినలేదూ.. ముసిలిముప్పున దెబ్బలుత గిలి మంచాన బడి తిరుక్కోలాక సచ్చిపోయినారని. ఈ ఆలోచన రాగానే మరింత బాధయ్యింది నాకు.

దానితో మాకు ఒకనాటి బంధమా!

అది మా ఇంటికొచ్చినాక ఎన్ని ఈతలు ఈనిందో గుర్తేలేదు. దాని పాలు తాగినకాడికి తాగి, మిగిలినోటియి అమ్ముకుంటిమి. దానికి పుట్టిన బిడ్డలను కొన్ని పాడికి ఉంచుకొని, కొన్ని అమ్ముకోని సొమ్ముజేసుకుంటిమి. సమయం తప్పి దాని బిడ్డ సచ్చిపోయి, సేపు కోసం పొదుగులో మూతి బెట్టే దూడ లేకపోయినా.. ఇంత వట్టిగెడ్డి దాని మొఖాన ఇదిలిచ్చి, పొదుగులో సెయ్యిబెడితే కదలకుండా పాలిచ్చే పెద్దబుద్ధి దానిది. వగసిలో మా ఇంటికొచ్చి, మా ఇంట్లో భాగమయ్యి మాకింత సాయంజేసి ముసిల్దయిపోయి, కడాన ఈనాటికి కాలిరగ్గొట్టుకొని సెప్పుకోడానికి నోరులే నిపానం కళ్లమ్మటి నీళ్లు కారుచ్చా మాదిట్టు సూచ్చా ఉంటే.. మా ఇంటిల్లిపాదికీ పేగులు తెగుతావుండాయి. మాయమ్మ పైట సెరుగుతో కల్లొత్తుకునేది జూసి..

''ఏందమ్మా! నువ్వు బర్రెకు దెబ్బ తగిల్తే ఇంతగా నొచ్చు కుంటా ఉండావే'' అంటిని నేను.

''అది మీకు గొడ్డు గావొచ్చు! నాకు మటుకు మాయమ్మ. మా పుట్టింట్లో అందరితో సెడ్డపడి దాన్ని నాకు తోలిచ్చి మాయమ్మ సచ్చిపాయా. అదీ, దాని కడుపున పుట్టిన బిడ్డలూ నాకు జేసిన సాయం మాయమ్మ బతికుంటే జేసునో లేదో! ఇది జేసినమేలు సిన్నదిగాదు నాయినా. ఈనాటికి ఇది కటికోని పాలైతదేమో!?'' అనింది మాయమ్మ బాధగా.

నిజమే! మానాయన జేసిన సేద్యంతోనే సంసారం సాగీలా మాయమ్మ. ఆడపిల్లోళ్లకు నలుగురిలో నామో సిగా ఉంటాదాని సెవుల్లోకి, ముక్కుల్లోకి పాడిమీద మిగిలిచ్చే కొనింది. సుట్టాలల్లో ఎవ్వరి ఆడపిల్లోళ్లు మూలగూ చ్చున్నా, ఎవ్వరైనా నెలదప్పినా.. సారెలు, సీరెలు ఎత్తక పోయి సుట్టాలల్లో మా ఇంటి మర్యాద కాపాడింది మా నాయినిచ్చిన లెక్కతోగాదు. ఇది గెడ్డి గేదం మేసి.. పాలగా మార్చి, మా ఇంట్లో పిండిన దాని నెత్తరతో.

ఒకసారి మా సిన్న సెల్లెలు సీతామాలచ్చుమమ్మ సింతా కోళ్ల ఇంటికి సుట్టాలొచ్చింటే.. వాళ్ల పిల్లోన్ని రోజంతా ఎత్తుకోనునింది. ఆ పిల్లోని మెళ్లో గొలుసు పోయిందని మాయమ్మిమీద నింద బేసిండు పిల్లోని నాయన.

''నేను సచ్చిపోతానమ్మా!'' అని మాయమ్మి ఏడుస్తా ఉంటే..

''నువ్వుండమ్మా! నా పెంపకం నాకు దెల్సులే!'' అని అప్పటికప్పుడు మాయమ్మ దేవుడి పటాల ఎనక దాసి పెట్టిన పాలడబ్బులు దీసి, వాళ్లింటికి బోయి.. తీసుకో మని దేవుని పటంకాడ పెట్టింది. ఆ డబ్బులు ముసిలి గొడ్డు, దాని బిడ్డలమీద కూడబెట్టిందే.

అందరూ భయంభయంగా లెక్కదిట్టు సూచ్చే..

''గొలుసిచ్చే దొరికిపోతామని లెక్క దెచ్చి నాటకం ఆడ తాండారు'' అని లెక్క జోబీలో పెట్టుకున్నెడు వాళ్లల్లుడు. మల్ల దెలిసింది.. ఆ గొలుసు సీట్లాటలో వాడే పోగొట్టిండని.

ఇయన్నీ గెవనానికొచ్చి..

'ముసిలెనుము జీవుడు పోతే మా ఇంట్లోనే పోవాల తప్ప.. కోసుకునేదానికి ఇచ్చేది లేదు!' అని నా పానంగెట్టి జేసుకుంటి.

* * *

పోయిన కార్తీకమాసంలో మా ముసిలెనుము ఒకసారి సచ్చి బతికినట్లయ్యింది.

ముసురుబట్టి కురుచ్చా ఉండిన వాన, జడివానగా మారి.. తుఫానుకు తిరుక్కున్నెది. వానలో ఎంతసేపని కట్టు గుంజలకు నిలగట్టి సంపుతామని, అట్ల తిరుక్కోనొ చ్చాయిలే అని గొడ్లను వంకవతలి మిట్టకు తోలొచ్చినం. ఒక్కసారిగా వంకసాగడంతో అవతలిగొడ్లు అవతలనే నిలబడిపోయినాయి. వాటిల్లో మా ముసిలెనుము కూడా ఉంది.

''నాయినా! అట్ల వంకదనకా పోయిరాపోరా! ఎను ములు అవతల నిలిసిపోయుండాయని అందరూ పోతా ఉండారు'' అని మాయమ్మ చెప్పే పోయినా.

వంక మాంతంగా పారతా ఉంది. బలంగా ఉండే గొడ్లు ఒక్కొక్కటే దాటి ఇవతలికి వస్తా ఉండాయి. మాయి గూడా రెండు దాటొచ్చినయి. వాగు మట్టం అంతకం తకూ పెరుగుతాంది. ముసిల్ది మాత్రం దాటుకుంటానో లేదోనని భయపడి అవతలి పక్కనే ఉండాది.

నేను పొయ్యి అదిలిచ్చే.. వంకదాటుకుంటాదేమోనని వంకలో దిగినా.

''ఒరే! తెలివుందా లేదా? భద్రం గావాల. దాటుకోలేవ్'' అని అందరూ అరుచ్చావుండారు.

నేను లెక్కజెయ్యకుండా వంకలో దిగినా. నడమల్లోతు నీళ్లదూరం పోతానే.. నీళ్ల వరవడి నన్ను తొయ్యసాగింది. కుడికాలు ఎత్తి పెట్టేలోపు సిలపరి సెప్పు ఊడిపోయి నీళ్ల మ్మిడి పోయింది. నా వొంట్లోకి భయమొచ్చింది. రెండో సెప్పుగూడా నీల్లపాలుజేసి యెనిక్కొచ్చినా.

ఇవతల నిలబడి..

'దా.. ప్రివ్వి.. దా!'' అని పిలిచ్చే.. నా గొంతు గుర్తుబట్టి అరిసింది.

దానికి కొంచెం ధైర్యం వచ్చినట్టుండాది. అడుగుముందు